క్లుప్తంగా

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల నమోదు



ధరూరు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రజలు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మల్దకల్: బైక్, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బింగిదొడ్డి గ్రామానికి చెందిన నర్సింహులు బైక్‌పై అమరవాయి నుంచి బింగిదొడ్డికి వెళ్తుండగా మార్గమధ్యలో గద్వాల నుంచి వెళ్తున్న బొలెరో వాహనం మల్దకల్ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో నర్సింహులు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూల్ ఆస్పత్రి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్‌కు నిప్పు.. పోలీసులకు ఫిర్యాదు

మల్దకల్: గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌కు నిప్పుపెట్టిన ఘటన మండలంలోని విఠలాపురం గ్రామంలో బుధవారం చేసుకుంది. బాధిత రైతు ఆనంద్ తెలిపిన వివరాలు.. రోజులానే వ్యవసాయ పనులు ముగించుకొని పొలం వద్దనే ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి ఉంచి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లగా ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైనట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేయండి

అయిజ: మండల కేంద్రంలో ఈనెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఎంబీ బేతేలు చర్చి ప్రతిష్ఠ ఉత్సవాలు విజయవంతం చేయాలని ఎంబీ బేతేలు చర్చి పాస్టర్లు సీమోను, సుజాత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ముఖ్య అతిథిలుగా ఎంఎస్ ప్రెసిడెంట్, డాక్టర్ పీబీ అర్నాల్డ్, డీడీ ప్రెసిడెంట్ ఆర్ఎస్ లేమూయేలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అమరచింత: గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో జరిగే తగాదాలు, చోరీలను అరికట్టవచ్చని ఎస్‌ఐ సురేష్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో బుధవారం సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన వీధుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆయా కాలనీలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను నిలువరించే అవకాశం ఉందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా విరాళాలు అందించి వేగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాని కోరారు.

నేడు రైతు ధర్నా

అమరచింత: పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించే చట్టం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గురువారం జరిగే రైతు ధర్నాను జయప్రదం చేయాలని ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. ఈనెల 8న అఖిల భారత ఐక్యరైతు సంఘం ఆల్ ఇండియా కమిటీ ఆధ్వర్యంలో రైతు, రైతుకూలీల సమస్యలపై దేశంలో అన్ని రాష్ట్ర రాజధానిల్లో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని రకాల పంటలకు ఎంఎస్‌పీని చట్టబద్ధం చేయాలని, చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులకు పూర్తి రుణమాఫీ చేయాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యొక్క పరస్పర సుంకాలకు లొంగొద్దని, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలని నిర్వహించే ధర్నా కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు పాల్గొనాలని కోరారు.

ఊరికి దూరం.. నిరుపయోగం

- గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాల ఏర్పాటు
- అందుబాటులో లేని సామగ్రి
- అసహనంలో క్రీడాకారులు



పెద్దపోతులపాడులో పాఠశాల ఆవరణలో నిర్మించిన క్రీడా ప్రాంగణం

మానవపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం మారాయి. ఎకరా స్థలంలో రూ.3 నుంచి 5 లక్షల వరకు వెచ్చించి నిర్మించిన ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా, సరైన మౌలిక సదుపాయాలు లేక అలంకార ప్రాయంగా మారాయంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

14 గ్రామాల్లో ఏర్పాటు

మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో 14 గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. పల్లెపాడు, చంద్రశేఖర్‌నగర్ ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక ఏర్పాటు చేయలేదు. ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా, మరికొన్ని చోట్ల పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ మైదానాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్, వంటి క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రి ఇంత వరకు సమకూర్చలేదు. పేరుకే క్రీడా ప్రాంగణాలని బోర్డులు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారని క్రీడా కారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలకు దూరం

గ్రామాలకు దూరంగా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం ద్వారా యువతలో క్రీడలపై ఆసక్తి లోపించింది. మరికొన్ని చోట్ల పాఠశాలల ఆవరణలో ఉండటం ద్వారా తరగతులు బోధించేటపుడు ఆటలు ఆడటం ఎలా అని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో క్రీడా ప్రాంగణాలను ఎక్కడ పడితే అక్కడ నిర్మించారని మండిపడుతున్నారు.

క్రీడా సామగ్రి కరువు

క్రీడా ప్రాంగణాల్లో క్రీడా సామగ్రి కూడా అందుబాటులో ఉంచకపోవడంపై క్రీడా కారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాల్లో క్రీడా సామగ్రితోపాటు మౌలిక వసతులు కల్పించాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

క్రీడలకు దూరమవుతున్నారు



గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది యువత మైదానాలు లేక క్రీడలకు దూరమవుతున్నారు. అసంపూర్తిగా ఉన్న క్రీడా ప్రాంగణాలను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి. యువత ఉత్సాహంగా ఉన్నా వసతులు అందుబాటులో లేవు.

- మోహన్‌బాబు క్రీడాకారుడు చెన్నిపాడు

పాఠశాలలో క్రీడా ప్రాంగణాలు



క్రీడా ప్రాంగణాలను పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. అందరికీ అందుబాటులో ప్రాంగణాలు నిర్మిస్తే బాగుండేది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని సౌకర్యాలు కల్పించాలి.

- సూరి, కొర్విపాడు

సామగ్రి అందుబాటులో ఉంచుతాం

మండలంలో 16 గ్రామ పంచాయతీలకుగానూ 14 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించాం. స్థలం అందుబాటులో లేక రెండు గ్రామాల్లో ప్రాంగణాలు నిర్మించ లేదు. వారం వ్యవధిలో క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

- భాస్కర్, ఎంపీడీఓ మానవపాడు

సార్వత్రిక సమ్మె విజయవంతం చేద్దాం



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

అలంపూర్: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జీ రాజు కోరారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లు మహేష్, కళ్యాణ్‌లకు ఈనెల 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె నోటీసు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు, కర్షక, ఉపాధి హామీ కూలీలు, ప్రజల సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధి కూలీలకు రెండున్నర లక్షల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. ఏడాదికి పని దినాలు 200 రోజులు, రోజువారి కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లోనూ ఉపాధి హామీ పనులు ప్రవేశపెట్టాలన్నారు. ఉపాధి హామీలో పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూమి లేని వ్యవసాయ కూలీలకు, గ్రామాల్లోని పేదలకు భూమిని పంచాలన్నారు. అదే విధంగా నిరుపేదలు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.15 లక్షలు ఆర్థిక సాయం చేయాలని కోరారు. స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెకు శ్రామికులు సంఘాలు, పార్టీలకు అతీతంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, నాయకులు నరసింహ్మ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే సమ్మర్ క్యాంపులు



క్యాంపు ప్రారంభోత్సవంలో నాయకులు, పాఠశాల సిబ్బంది

గద్వాల: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సమ్మర్ క్యాంపులు ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వేసవి సెలవుల్లో విజ్ఞానంతో పాటు వినోదాన్ని అందించేందుకు హైదరాబాద్ లెర్న్ ఓరామ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు రోబోటిక్స్, ఏఐ టెక్నాలజీ వంటి ప్రోగ్రామ్స్‌ని అందించి కంప్యూటర్ రంగంలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు బాబునాయుడు, బీచుపల్లి, ప్రదీప్, మాజీ ఎంపీపీ విజయ్, సుదర్శన్‌రెడ్డి, తిక్కన్న, ప్రిన్సిపాల్ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అలంపూర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఎస్‌ఐ కుమార్

అలంపూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ ఎస్‌ఐ కుమార్ అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో సైబర్ నేరాలపై బుధవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్‌ఐ మాట్లాడుతూ.. సమాజంలో రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ, వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు ఇవ్వకూడదన్నారు. సైబర్ నేరాల బారిన పడిడినవారు తక్షణం 1930కి సమాచారం అందించాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూ సమస్యల పరిష్కారం



పోల్కంపల్లి రెవెన్యూ గ్రామసభలో సమస్యలు వింటున్న కలెక్టర్ విజయేందిర బోయి

అడ్డాకుల: ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. భూ భారతి చట్టం అమలు కోసం జిల్లాలో మూసాపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా పోల్కంపల్లి, సంకలమద్ది గ్రామాల రెవెన్యూ గ్రామ సభలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామ సభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో భూముల సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించారు. భూ సమస్యలపై అర్జీలు తెచ్చిన దరఖాస్తుదారులతో కలెక్టర్ మాట్లాడారు. భూ భారతి చట్టంలో పొందుపర్చిన అంశాలపై ప్రజలకు వివరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు అందజేసిన వారు తప్పకుండా వాటికి సంబంధించిన అన్ని రికార్డుల పత్రాలను కూడా అందజేస్తే విచారణలో అధికారులు సరైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోల్కంపల్లిలో 38, సంకలమద్దిలో 32 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, తహసీల్దార్లు రాజు నాయక్, మదన్‌మోహన్‌గౌడ్, గిర్దావర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై కళా ప్రదర్శన

వీపనగండ్ల: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీ పనికి వెళ్తున్న వారికి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బుధవారం వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ఉపాధి కూలీలకు తమ ఆటపాటల ద్వారా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళాకారులు వివరించారు. అలాగే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీలు, రాజీవ్ యువవికాసం, సైబర్ నేరాలు, తదితర అంశాల గురించి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేశ్‌రెడ్డి, శిల్ప, కళాకారులు బోనాసి రాజు, నర్సింహ, కృష్ణయ్య, శ్రీనివాసులు, సువర్ణ, రాధ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్లకు మద్దతుగా ర్యాలీ



గద్వాలలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు



ముచ్చోనిపల్లెలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గద్వాల: పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ సంయుక్తంగా మెరుపు దాడులు చేపడుతున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో బీజేపీ, ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జవాన్లకు మద్దతుగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు బండల వెంకట్రాములు, త్యాగరాజ్, నాయకులు గోపాల్‌రావు, ప్రదీప్, కరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు: జాతీయ జెండాలతో ఆర్మీ జవాన్లకు మద్దతుగా మండలంలోని ముచ్చోనిపల్లె గ్రామంలో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాద స్థావరాలపై 'ఆపరేషన్ సింధూర్' పేరుతో ఆర్మీ జవాన్లు మెరుపు దాడులు విజయవంతంగా పూర్తి చేసినట్లు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి తెలిపారు. ప్రతి భారతీయుడు గర్వంచ దగ్గ విషయమన్నారు. జాతీయ జెండాలు పట్టుకొని వీధుల గుండా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగప్ప, నాయకులు శివారెడ్డి, నాగప్ప, సంజీవరెడ్డి, భగత్‌రెడ్డి, అశోక్, టైలర్ శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం తరఫున ప్రతీకారం తీర్చుకునే సమయం ఆసన్నమైందని బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ అన్నారు. పెహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రతీకార దాడులు ధైర్యాన్నిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కేటీదొడ్డి: మండలంలోని చింతలకుంట గ్రామంలో బుధవారం పరిశీలన అధికారి ఏఓ సాజిద్ రెహమాన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించేందుకే సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిమ్మన్‌గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై చర్యలు శూన్యం

రాజోళి: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ప్రభుత్వ చర్యలు శూన్యమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చాలా గ్రామాల్లో మూడు రోజులకొకసారి కూడా తాగునీరు రావడం లేదన్నారు. తాగునీటి ఎద్దడిపై అధికారులు, అధికార పార్టీ నాయకుల చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత జయంతి మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

గద్వాల: జిల్లా కేంద్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జయంతి మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలో పతాకావిష్కరణ, అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ నరహరి, శ్రీనివాసులు, బిలకంటి రాములు, భక్తులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



నందిన్నెలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిళా సంఘాలు

కేటీదొడ్డి: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం గోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని నందిన్నెలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న, లావు ధాన్యం రకానికి క్వింటాకు రూ.2,320 మద్దతు ధర, సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘాలు, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

జడ్చర్ల టౌన్: రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం జడ్చర్ల రైల్వేస్టేషన్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రైల్వేలో భద్రత చర్యలు పెంచాలని, ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు పోరాటానికి ముందుకు రావాలన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న దాదాపు 5లక్షల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ప్యాసింజర్ రైళ్లను పెంచాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్‌క్లాస్, జనరల్ కంపార్ట్‌మెంట్‌లను పెంచాలన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన రైల్వే వ్యవస్థను కేంద్రం ప్రైవేటీకరించటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని, అందరం వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో ఖమర్ అలి, తెలుగు సత్తయ్య, మున్నా బాయ్, కృష్ణ, సాగర్, మహేష్, పుల్లయ్య, రాంసింగ్, సురేంద్రసింగ్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయం నుంచి తాగునీటి కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. బుధవారం నాటికి పూర్తి స్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు గాను 1,015 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశామని ఏఈ వరప్రసాద్ తెలిపారు. రామన్‌పాడు ఎడమ, కుడి కాల్వ ద్వారా 12 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఇంజమవ్వ, మారెమ్మవ్వ ఉత్సవాలు



ఇందువాసి ఇంజమ్మవ్వ ఆలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, తదితరులు

గట్టు: మండలంలోని ఇందువాసి, ముచ్చోనిపల్లె గ్రామాల్లో నిర్వహించిన దేవర ఉత్సవాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఇందువాసి ఇంజమ్మవ్వ, ముచ్చోనిపల్లె మారెమ్మవ్వ ఆలయాల్లో ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పూజలు చేశారు. అమ్మవార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్గెర హనుమంతునాయుడు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రంజిత్‌కుమార్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్‌గౌడ్ తదతరులు పాల్గొన్నారు.



కోతులగిద్దలో గ్రామ దేవతల ఉత్సవాల్లో పాల్గొన్న గొంగళ్ల రంజిత్‌కుమార్

ధరూరు: మండల పరిధిలోని ర్యాలంపాడు, కోతులగిద్ద గ్రామాల్లో నిర్వహించిన గ్రామ దేవతల ఉత్సవాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక విందు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, దౌలన్న, రంగస్వామి, నర్సింహులు, పురుషోత్తంరెడ్డి, లవన్న, నెట్టెంపాడు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని అమరవాయి, పెద్దొడ్డి గ్రామాల్లో సవారమ్మ, సుంకులమ్మ, తాయమ్మ, కట్రెమ్మ, మైసమ్మ ఆలయాల్లో దేవర ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు పొట్టేళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఇందువాసిలో పూజల్లో కాంగ్రెస్ నాయకురాలు సరిత, తదితరులు